# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు బీహార్‌లోని గయలో సుమారు 13 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.
- రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థికమంత్రికి విజ్ఞప్తి చేశారు.
- డీఎస్సీ పరీక్షను ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని మంత్రి నారా లోకేష్ తెలిపారు.
- అమరావతి ప్రాంతం రాజధానికి అత్యంత అనువైన, సురక్షితమైన ప్రాంతమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు బీహార్‌లోని గయలో దాదాపు 13 వేల కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గయ, ఢిల్లీ మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును, వైశాలీ, కోడెర్మా మధ్య బౌద్ధ సర్క్యూట్ రైలును ఆయన ప్రారంభించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్ కింద 12 వేల మంది గ్రామీణ లబ్ధిదారులకు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్ కింద నాలుగు వేలకు పైగా లబ్ధిదారులకు గృహప్రవేశ వేడుకలో భాగంగా కొంతమంది లబ్ధిదారులకు తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీహార్ అభివృద్ధి NDA ప్రభుత్వానికి ప్రాధాన్యతా అంశమని పేర్కొన్నారు. బీహార్‌లో ప్రారంభించిన ప్రాజెక్టులు పరిశ్రమ రంగాన్ని బలోపేతం చేస్తాయని, యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని తెలియజేశారు.

===================

ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రాష్ట్రంలో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించాలని ఆమెను కోరారు. ఇప్పటివరకు రాష్ట్రానికి ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయ పథకం కింద 2 వేల 10 కోట్ల రూపాయల మొత్తం లభించిందని, పెండింగ్‌లో ఉన్న మూలధన ప్రాజెక్టుల కోసం అదనంగా 5 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ ప్రోత్సాహక పథకం మార్గదర్శకాల ప్రకారం 250 కోట్ల రూపాయల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై తగు ఉత్తర్వులు ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు.

===================

రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 16 వేల 347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి, విజయవంతంగా నిర్వహించామని ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈరోజు ఆయన ఉండవల్లిలో విద్యాశాఖపై రాష్ట్ర స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఇకమీదట ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహించి, ఖాళీలను భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలను మెరుగు పర్చేందుకు గత 14నెలలుగా అనేక సంస్కరణలు చేపట్టామని తెలిపారు. సంస్కరణల అంతిమ లక్ష్యం ఫలితాలే అన్న ఆయన.. మెరుగైన ఫలితాలపై

దృష్టిసారించాల్సిన బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులదే అన్నారు. వార్షిక విద్యా నివేదిక ప్రకారం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం అమలులో జాతీయస్థాయిలో రాష్ట్రం 14వ స్థానంలో ఉందని, దీనిని మెరుగు పరచవలసి ఉందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

===================

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ బిల్ ఎంతో ప్రయోజనకరమైనదని అనంతపురం జిల్లాకు చెందిన మానసిక వైద్య నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆన్ లైన్ బెట్టింగ్ ద్వారా ఎంతోమంది ఆర్థికంగా దెబ్బతిన్నారని, మానసికంగా కృంగిపోయారని వారు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా కొంతమంది యువకులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యి ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారని అనంతపురం పట్టణానికి చెందిన మానసిక వైద్య నిపుణులు బాలాజీ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...31 సెకన్లు)

===================

అమరావతి ప్రాంతం రాజధానికి అత్యంత అనువైన, సురక్షితమైన ప్రాంతమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భారీ వర్షాలకు, వరదలకు కూడా ముంపునకు గురికాదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరదల తాకిడికి రాజధాని ప్రాంతం మునిగిపోయిందంటూ వివిధ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. గత సంవత్సరం బుడమేరు వరదల ఫోటోలను, వీడియోలను చూపిస్తూ కొందరు.. అమరావతి మునిగిందని ప్రజల్లో అపోహలు సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో కూడా వరదలు వస్తే రాజధాని ప్రాంతంపై ఎలాంటి ప్రభావం పడకుండా కొండవీడు ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మించారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

===================

విరామం

===================

ఆటిజం చిన్నారులకు 2 నెలల్లో కొత్త పరికరాలు, ఉపకరణాలు అందజేస్తామని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ. ఆంజనేయులు తెలిపారు. ఈరోజు ఆయన వినుకొండలో పాఠశాల విద్యా శాఖ- సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో జరిగిన ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 85 వేల మంది ఆటిజం విద్యార్థుల కోసం 2 వేల 282 మంది స్పెషల్ టీచర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఫిజియోథెరపిస్ట్ లను కూడా నియమిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 125 ఆటిజం కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నామని జీ.వీ. ఆంజనేయులు పేర్కొంటూ...

(వాయిస్ బైట్...31 సెకన్లు)

===================

యూరియా సరఫరా విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని, గత ఖరీఫ్ సీజన్ కంటే ప్రస్తుత ఖరీఫ్ సీజన్లోనే ఎరువులను ఎక్కువగా సరఫరా చేశామని అధికారులు చెప్పారు. అలాగే రైతులు కూడా అవసరానికి తగిన విధంగా యూరియాను కొనుగోలు చేయాలని అధికారులు సూచించారు. రైతుల ఎరువుల అవసరాలను తీర్చేందుకు.. సమయానికి, సమృద్ధిగా ఎరువులు అందించేందుకు ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా నిఘా ఏర్పాటు చేశామని, అలాగే ధరలు పెరగకుండా చూస్తున్నామని అధికారులు చెప్పారు.

===================

విశాఖ జిల్లాలో స్పోర్ట్స్ అకాడమీలను త్వరలోనే తిరిగి ప్రారంభిస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాప్) ఛైర్మన్ రవినాయుడు అన్నారు. ఈ నెల 29న నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా విశాఖ జిల్లా కొమ్మాదిలోని డీఎస్ఏ స్టేడియంలో జోనల్ స్థాయి క్రీడాపోటీలను.. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, పాడేరు, విశాఖ, మన్యం జిల్లాల నుండి క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ.. విశాఖ వేదికగా ఈ నెల 29న జరిగే నేషనల్ స్పోర్ట్స్ డే కార్యక్రమాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిధిగా హాజరవుతారని చెప్పారు.

===================

వాయువ్య బంగాళాఖాతం, ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో ఈ నెల 25వ తేదీ నాటికి కొత్త అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ విభాగం అధికారి నారాయణ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...29 సెకన్లు)

===================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

===================
===================